# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-08-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్‌గా మార్చేందుకు "వోకల్ ఫర్ లోకల్"కి ప్రాధ్యానమివ్వాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.**
2. **రాష్ట్రాన్ని పునర్నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.**
4. **మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విజయవాడలో ప్రారంభిస్తారు.**
5. **దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో గృహాలకు కొళాయి కనెక్షన్లను అందించే జల్ జీవన్ మిషన్ ఈ రోజుతో 6 ఏళ్ళు పూర్తి చేసుకుంది.**

==========================

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈరోజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్లు వేదికపై పూల వర్షం కురిపించాయి. అనంతరం ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ఈ స్వాతంత్ర్య దినోత్సవం ఆశ, ఆకాంక్షల పండుగ అని అన్నారు. భారతదేశాన్ని స్వావలంబన, అభివృద్ధి చెందిన దేశంగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భారతదేశం ప్రతి రంగంలో ఆధునిక పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తోందని చెప్పారు. లక్షలాది మంది త్యాగం ద్వారా స్వేచ్ఛా భారతదేశాన్ని సాధించగలిగామని, దృఢ సంకల్పం, కృషి, స్వావలంబన, స్వదేశీ మంత్రం ద్వారా సంపన్న భారతదేశాన్ని నిర్మించవచ్చని ఆకాంక్షించారు. దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్‌గా మార్చేందుకు "వోకల్ ఫర్ లోకల్ " కు ప్రాధ్యానమివ్వాలని ప్రధానమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు

------------------------

రాష్ట్ర వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో ఈ రోజు జరిగిన రాష్ట్ర స్థాయి వేడుకలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. తమ విధుల్లో ప్రతిభ కనబరిచిన

పోలీసులకు పతాకాలను ప్రధానం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పునర్నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వేల కోట్ల రూపాయలతో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ... 32 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని పలు జిల్లాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలల్లో పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. గుంటూరులో మానవ వనరులు శాఖ మంత్రి నారా లోకేష్, విజయనగరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అనంతపురంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మచిలీపట్నంలో రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఒంగోలులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. అలాగే చిత్తూరులో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, నరసరావుపేటలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, తిరుపతిలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరులో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణలు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాకినాడలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలల్లో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పాల్గొని మాట్లాడుతూ,

వాయిస్...35 సెకన్లు

మరో వైపు అమరావతిలోని రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. విజయవాడలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏపీ పీసీసి అధ్యక్షురాలు వై.యస్ షర్మిల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

అలాగే గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ కర్త సజ్జల రామ కృష్ణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టాండ్‌లో లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం ఆయా జిల్లాలలో మంత్రులు, స్థానిక శాసనసభ్యులు ప్రారంభిస్తారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు, థర్డ్ జెండర్లలు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని అధికారులు తెలిపారు. ప్రయాణ సమయంలో మహిళలు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఓటర్ ఐడీ కార్డులలో ఏదో ఒకటి కండక్టర్‌కు చూపించి 'జీరో ఫేర్ టికెట్' పొందాల్సి ఉంటుందని అధికారులు తెలియజేశారు. కాగా నాన్‌స్టాప్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులతో పాటు ఘాట్ రోడ్లలో తిరిగే సర్వీసులకు ఈ పథకం వర్తించదని అధికారులు స్పష్టం చేశారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలపై రాష్ట్రంలోని 13 వేల 326 పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు ఈరోజు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో మూడు అంశాలపై గ్రామసభలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఇందులో భాగంగా పునరుత్పాదక ఇంధన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పశుసంవర్ధకశాఖ సహకారంతో శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయడంపై ప్రధానంగా గ్రామసభల్లో చర్చించి తీర్మానాలు చేయాలని కేంద్రం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహిస్తోంది.

---------------------------

దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో గృహాలకు కొళాయి కనెక్షన్లను అందించే జల్ జీవన్ మిషన్ ఈ రోజుతో 6 ఏళ్ళు పూర్తి చేసుకుంది. గ్రామీణ ప్రాంతంలో ప్రతి గృహానికి కొళాయి ద్వారా రక్షిత మంచి నీరు సరఫరా చేయాలన్న లక్ష్యంతో రూపొందిన జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2019 ఆగస్ట్ 15వ తేదీన ప్రారంభించారు. ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా స్వచ్ఛమైన నీరందించే లక్ష్యంతో ఏర్పాటైన ఈ పథకం దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోంది. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో 15 కోట్ల గృహాలకు కొళాయి కనెక్షన్లను కల్పించారు. దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో వున్న గృహాలలో 19 కోట్లమందికిపైగా ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. పశ్చిమ దిశగా కదులుతూ.. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిషా వైపు ప్రయాణించే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 3 రోజులపాటు ఉత్తరాంధ్రతో పాటు దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆకాశవాణి విజయవాడ కేంద్రం డీడీజీ, కార్యాలయ అధిపతి ఎమ్. సోమేశ్వర రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. దేశభక్తిని పెంపొందించే అనేక కార్యక్రమాలను ఆకాశవాణి ప్రసారం చేస్తోందని అన్నారు. ఈ వేడుకల్లో సీనియర్ ఏవో జె. సూర్యనారాయణ, ఆకాశవాణి వార్తా విభాగాధిపతి టి. హెన్రీ రాజ్, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ చుండూరి మాణిక్య రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

=====================